# అడ్డగుట్టను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపనలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ● రూ.18 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



అడ్డగుట్టలో పద్మారావుకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు



30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉపసభాపతి పద్మారావు గౌడ్, కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి తదితరులు

అడ్డగుట్ట, అక్టోబర్ 8 : అడ్డగుట్టను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్ ప్రాంతాల్లో సుమారు రూ. 18 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, అధికారులు, పార్టీశ్రేణులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఇందులో ప్రధానంగా రూ.13.05 కోట్ల నిధులతో అడ్డగుట్ట ప్రజల చిరకాల స్వప్నమైనా 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ప్రజల సౌకర్యార్థం, వారి అభిమతం మేరకు ఆసుపత్రి నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్న పద్మారావు గౌడ్ స్థానిక ప్రజలు, మహిళలు జేజేలు పలికారు. అనంతరం అడ్డగుట్ట బీ, డీ సెక్షన్, వడ్డెరబస్తీ, రియో పాయింట్, సాయినగర్, తుకారాంగేట్, మరాఠా బస్తీ, శాస్త్రినగర్, లాలాగూడ, శాంతినగర్, శేషాపహాడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి మంచినీరు, సీవరేజ్ పైపులైన్ పనులకు, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... ప్రజల అవసరాలను తెలుసుకొని దానికి అనుగుణంగా పాలనను అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు రామేశ్వర్ గౌడ్, నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జలమండలి డీజీఎంలు కృష్ణ, సరిత, సెక్షన్ మేనేజర్లు నిఖితారెడ్డి, స్రవంతి, పార్టీశ్రేణులు నక్కమధు, పాలకూర శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, పెండెం మనోహర్, మధు గౌడ్, మహమ్మద్, ఎల్లయ్య, పొన్నాల రాజు, గౌస్, రామప్పచారి, విక్కుర్తి పోచయ్య, పెద్దోళ్ల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి,బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ తదితరులు

## బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత**

బొల్లారం,అక్టోబర్ 8: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.లాస్యనందిత అన్నారు.ఆదివారం ఎనిమిదో వార్డు పరిధిలోని బొల్లారం బజార్‌లో డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ యువజన సంఘం కమ్యూనిటీ భవనాన్ని వైస్ చైర్మన్ వేణు గోపాల్‌రెడ్డి,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి,బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ..బడుగు,బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు.దివంగత నేత ఎమ్మెల్యే సాయన్న కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని..ఆయన కుమార్తెగా ప్రజా సేవ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని,దళితుల పక్షపాతి అయిన గులాబీ సర్కారును మరో సారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు నళిని కిరణ్,ఖదీరవన్, అంబేద్కర్ యువక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గులాబీ సర్కారుతోనే..సంక్షేమ ఫలాలు



ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ భవనాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత తదితరులు

గులాబీ సర్కారు ఉంటేనే.. పేదోళ్లకు సంక్షేమ ఫలాలు అందుతాయని కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారంలో వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి , బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి,మాజీ సభ్యుడు లోక్ నాథ్ తో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్,రజక సంఘం,తోటి సంఘం,పెన్షన్ పురా బస్తీ, కమ్యూనిటీ భవనాలను పరిశీలించి కమిటీ నాయకులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా లాస్య నందిత మాట్లాడుతూ..గులాబీ జెండాతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నివేదిత,నళిని కిరణ్,ఈఆర్ బాల్‌రాజు,ఎర్రోళ్ల గిరి,మురళి యాదవ్,అమర్,ఉమేష్ రావు,ఉదయ్,నవీన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బొల్లారంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

బొల్లారం,అక్టోబర్ 8: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ దయాకర్‌రెడ్డి గ్రంథాలయ స్థల నిర్మాణానికి బొల్లారం బజార్‌లోని గాంధీ గ్రౌండ్‌ను స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ..గ్రంథాలయ భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

## పాలమూరు బస్తీ అభివృద్ధికి కృషి

అంబర్‌పేట : బతుకమ్మకుంటలో గల పాలమూరు బస్తీ(వాంబే కాలనీ) అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. వాంబే కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్‌కు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ ఉన్న సగర కులస్తులతో పాటు వాంబే కాలనీలో నివాసముంటున్న వారి కోసం కమ్యూనిటీహాల్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు.

## 'బస్తీ సమస్యలు పరిష్కరించండి'



డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ సభ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 8: తార్నాక డివిజన్ వినోభానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు తార్నాకలోని నగర డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్తీలో చాలారోజులుగా మురుగునీరు సమస్య, రోడ్ ప్యాచ్‌వర్క్, విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రామకృష్ణ, వెంకటా చారి, వరప్రసాద్, శ్రీనివాస్, సిద్ధరామం, హరికృష్ణ, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి



వంట సామగ్రిని అందజేస్తున్న గోలి సుజాత ప్రకాశ్ ఫౌండేషన్ ప్రతినిధులు

సికింద్రాబాద్,అక్టోబర్ 8: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాలు పంచుకోవాలని గోలి సుజాత ప్రకాష్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోలి శ్రీధర్ అన్నారు.ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని వారాసిగూడలోని సుజాత ఐకేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోలి సుజాత ప్రకాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా పెళ్ళి చేసుకున్న పేద దివ్యాంగులైన దంపతులకు వంట సామగ్రిని ఉచితంగా అందచేశారు.ఈసందర్భంగా డాక్టర్ గోలి శ్రీధర్ మాట్లాడుతూ..తమ గోలి సుజాత ప్రకాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సామాజిక సేవలు చేశామన్నారు.ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగం పొదుపు చేసి సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ ఖర్చుతో విదేశీ వైద్య విద్య

అంబర్‌పేట, అక్టోబర్ 8: నీట్ పరీక్షలో ఉత్తీర్ణులై దేశంలో వైద్య విద్యలో సీటు రాని విద్యార్థులకు విదేశాలలో(కజకిస్తాన్) తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అందిస్తున్నామని జీవీకే బ్రదర్స్ ఎడ్యుకేట్ డైరెక్టర్, కాస్పియన్ విశ్వవిద్యాలయం వైస్ డీన్ డాక్టర్ జి.విద్యాకుమార్ అన్నారు. ఆదివారం శివం రోడ్డులో గల ఓ హోటల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జీవీకే యాన్యువల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా విద్యాకుమార్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో వైద్య విద్య చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు జీవీకే ద్వారా విదేశాల(కజకిస్తాన్)లో పేరుగాంచిన కాస్పియన్ విశ్వవిద్యాలయంలో నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన ఇండియన్ ఫుడ్‌ను కూడా అందిస్తున్నామని చెప్పారు.

## ప్రజలను చైతన్య పరిచేందుకే కమిటీల ఏర్పాటు

**– వికాస్ మంచ్ కార్యాలయంలో కీలక సమావేశం**



కంటోన్మెంట్, అక్టోబర్ 8: కం టోన్మెంట్‌లోని ప్రజలను చైతన్య పరిచేందుకు నూతనంగా నాలుగు కమిటీలను ఏర్పాటు చేసినట్లు వికాస్ మంచ్ అధ్యక్షుడు గడ్డం ఎబేల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్‌లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం మారేడ్‌పల్లిలోని వికాస్ మంచ్ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం భేటీలో సభ్యుల అభిప్రాయం ప్రకారం కంటోన్మెంట్ ప్రాంత ఆత్మగౌరవం, అభివృద్ధి కొరకు వికాస్ మంచ్ చేస్తున్న విలీన పోరాటంతో పాటు, రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాలుగు కమిటీలు ఏర్పాటు చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. దీంట్లో భాగంగా ప్లానింగ్ కమిటీ, మేనిఫెస్టో కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ఓటర్ అవేర్నెస్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వికాస్ మంచ్ సభ్యులు ఎలకంటి ప్రభు గుప్తా, మహమ్మద్ ఫసి, అరుణ్ కుమార్ యాదవ్, అంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.